క్లుప్తంగా

నిమజ్జన ఏర్పాట్లు పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

కొడంగల్ రూరల్: గణనాథుల నిమజ్జన ఏర్పాట్లను సోమవారం అధికారులు పరిశీలించారు. తహసీల్దార్ విజయకుమార్, ఇరిగేషన్ డీఈ కిరణ్, మున్సిపల్ కమిషనర్ బలరాంనాయక్, సీఐ శ్రీధర్‌రెడ్డి, ఎస్ఐ సత్యనారాయణ కొడంగల్‌లోని గొల్లకుంటను పరిశీలించారు. కుంట దగ్గర స్థలంలో తగిన ఏర్పాట్లు చేసేందుకు చర్యలు తీసుకున్నారు.

నూతన పీసీసీ అధ్యక్షుడిని కలిసిన రఘువీరారెడ్డి



ధారూరు: నూతన పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌ను పీసీసీ ప్రధాన కార్యదర్శి పటోళ్ల రఘువీరారెడ్డి సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ



నోట్ పుస్తకాలు అందజేస్తున్న రవీందర్‌గౌడ్

బొంరాస్‌పేట: గిరిజన విద్యార్థులకు 'యూత్ ఫర్ సేవా సంస్థ' ఉచిత సేవలతో తమ ఉదారతను చాటుకుంటోందని తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర కార్యదర్శి కె.రవీందర్‌గౌడ్ అన్నారు. సోమవారం మండలంలోని పూర్యానాయక్ తండాల ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందజేశారు. ప్రతిఏటా పేద, గిరిజన, దళిత విద్యార్థులకు అనేక రకాల సేవలు అందిస్తోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు.

ఉపాధ్యాయులకు ఊపిరి పీఆర్టీయూ

మండల సంఘం నాయకులు



నూతన కార్యవర్గం

బొంరాస్‌పేట: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పీఆర్టీయూ సంఘం ఊపిరి లాంటిదని ఆ సంఘం జిల్లా నాయకులు అన్నారు. సోమవారం ఉమ్మడి బొంరాస్‌పేట మండల పరిధిలోని బొంరాస్‌పేట, దుద్యాల మండలాల సర్వసభ్య సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల సంఘం అధ్యక్షుడిగా పి.అనిల్‌కుమార్, ప్రధానకార్యదర్శి శశిధర్, అసోసియేట్ అధ్యక్షుడు శ్రీహరి, మహిళా కార్యదర్శి విజయలక్ష్మి, కార్యదర్శిగా ఖాదీర్ ఎన్నికయ్యారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని సన్మానించారు. ఇందులో మాజీ మండల అధ్యక్షుడు రాధాకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పట్టాదారు పాసు పుస్తకం ఇప్పించండి

మొల్ల సుల్తానా

మోమిన్‌పేట: తన భూమికి పట్టాపాసు పుస్తకం ఇవ్వాలని మండలంలోని దుర్గంచెర్వు గ్రామానికి చెందిన మొల్ల సుల్తానా సోమవారం కలెక్టర్‌కు ఇచ్చిన వినతిపత్రంతో కోరింది. గత కొన్ని సంవత్సరాలుగా సర్వే నంబర్ 182లో భూమిని సాగు చేసుకొంటూ జీవనం సాగిస్తున్నానని తెలిపింది. ఆమె భర్త నూరద్దీన్ విద్యుదాఘాతంతో మృతి చెందాడు. ఈ భూమి తప్ప తనకు ఎటువంటి ఆధారం లేదని పాసుపుస్తకం ఇప్పించాలని విన్నవించింది.

నేడు పీఆర్టీయూ సమావేశం

కుల్కచర్ల : మండల కేంద్రంలోని నేడు(మంగళవారం) పీఆర్టీయూ మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం మండల అధ్యక్షుడు వెంకటేశ్ ముదిరాజ్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగుల సమస్యలు, బదిలీల ప్రక్రియ అంశాలపై సమావేశం నిర్వహిస్తున్నామని తెలిపారు.

దోమకాటు.. ఆరోగ్యానికి చేటు

- నిర్లక్ష్యం చేస్తే ప్రాణానికే ముప్పు
- ముసురు వర్షాలతో వ్యాధులు సోకే అవకాశం
- రోగాల వ్యాప్తికి దోమలే ప్రధాన కారణం
- గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

దుద్యాల్ : పది రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు గ్రామాల్లోని వీధులు, ఇంటి పరిసరాలు బురదమయంగా మారి, మురుగు, చెత్త వల్ల దోమలు వ్యాప్తి చెందే అవకాశాలు ఉన్నాయి. దీంతో వ్యాధులు సోకేందుకు ఆస్కారం ఉంది. గత కొన్ని రోజులుగా దోమ కాటుకు సంబంధించిన డెంగీ, మాలేరియా, చికెన్‌గున్యా వంటి వ్యాధుల బారిన ప్రజలు పడుతున్నారని వైద్యులు చెబుతున్నారు.

పొంచి ఉన్న వ్యాధులు

లేనిపోని రోగాలన్నీ దోమల ద్వారానే వస్తున్నాయని అనేక అధ్యయనాలు చెబుతున్నాయి. పరిశుభ్రత లోపం వల్లే దోమలు వృద్ధి చెందుతూ తమ ఉనికిని చాటుతున్నాయి. హత్యలు, ప్రమాదాలతో మరణించేవారి కంటే దోమల నుంచి వచ్చే వ్యాధుల కారణంగా మరణిస్తున్న వారి సంఖ్య అధికంగా ఉందని వైద్యులు తెలియజేస్తున్నారు.

మండలంలో రెండు డెంగీ కేసులు

మండలంలోని ఆలేడ్ గ్రామంలో వారం రోజుల క్రితం రెండు డెంగీ కేసులు నమోదు అయ్యాయి. వారు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్నారు.కాని, మండల పరిధిలోని హస్నాబాద్, కుదురుమల్ల, దుద్యాల్, లగచెర్ల, హకీంపేట్, చిలుముల మైల్వార్, చెట్టుపల్లి తండా, సత్తర్‌కుంట తండా, సంత్రకుంట తండా, ఈర్లపల్లి, పోలేపల్లి, పులిచెర్ల తండా తదితర గ్రామాలకు చెందిన వారు దాదాపు 20 మందికి పైగా ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. సాధారణ జ్వరాలు సోకిన వారు మండలంలో దాదాపు 500 మందికి పైగా ఉన్నారని అంచన. అనారోగ్యానికి కారణం దోమ లేనని ప్రజలు వాపోతున్నారు. గ్రామాల్లో పరిశుద్ధ్యం కరువైందనే వాదన ప్రజల నుంచి బలంగా వినిపిస్తుంది.



పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

దోమ కాటుతో వచ్చే వ్యాధులు

మలేరియా, డెంగీ, చికున్ గున్యా, ఫైలేరియా వంటి వ్యాధులు సోకే ప్రమాదముందని వైద్యులు సూచిస్తున్నారు. వ్యాధులను నివారించాలంటే వైద్యం ఇంటి నుంచే ప్రారంభం కావాలంటున్నారు.. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే తప్ప దోమల నియంత్రణ పూర్తిగా సాధ్యం కాదని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. గ్రామాల్లోని మురుగు కాల్వలు, చెత్త చెదారాన్ని శుభ్రం చేయించాలని ప్రజలు కోరుతున్నారు.



హస్నాబాద్‌లో ఇళ్ల మధ్య మురుగు కాల్వ

ముసురు వర్షాలతో..



పది రోజులుగా కురుస్తున్న ముసురు వర్షాల కారణంగా చల్లటి గాలి వీస్తుంది. దీంతో విషజ్వరాలు సోకే అవకాశాలు ఉన్నాయి. చిన్న, పెద్దలు అనే తేడా లేకుండా వ్యాధులు సంక్రమించే అవకాశం ఉంది. జ్వరం వస్తే నిర్లక్ష్యం చేయకుండా చికిత్స చేయించుకోవాలి.

– డాక్టర్ హేమంత్, బొంరాస్‌పేట

కలెక్టర్‌కు రిపోర్టు పంపుతాం

ఎంపీడీఓ జర్నప్ప

పెద్దేముల్: ప్రజావాణి కార్యక్రమానికి హాజరు కాని అధికారులపై కలెక్టర్‌కు హాజరు రిపోర్టు పంపుతామని ఎంపీడీఓ జర్నప్ప అన్నారు. అన్ని శాఖల అధికారులు పూర్తిస్థాయిలో హాజరుకావాలన్నారు. సోమవారం మూడు ఫిర్యాదులు వచ్చాయని తహసీల్దార్ కిషన్ తెలియచేశారు. ప్రజావాణి ప్రారంభమయినప్పటి నుంచి ఇప్పటివరకు పూర్తిస్థాయిలో అధికారులు హాజరుకాలేదని అన్నారు. ముఖ్యంగా వైద్య, వ్యవసాయ, అటవీ ,ఇరిగేషన్, ఏపీఓతో పాటు పలు శాఖల అధికారులు హాజరు కావలసి ఉండగా మూడు, నాలుగు శాఖల అధికారులు తప్ప ఎవ్వరు హాజరు కావడం లేదని అసహనం వ్యక్తం చేశారు. మరికొంత మంది 11గంటల తరువాత రావడం, హాజరు వేసుకోవడం, మళ్లీ వెళ్లిపోయిన అడిగే నాథుడు కరువయ్యారు. ఇప్పటి వరకు ఫిర్యాదులు ఇచ్చిన వాటిలో ఒక్క సమస్య కూడా పరిష్కారం కాలేదన్న ఆరోపణలు వినబడుతున్నాయి. కార్యక్రమంలో తహసీల్దార్ కిషన్, ఎంపీడీఓ జర్నప్ప, ఎంపీఓ రతన్‌సింగ్, పీఓ నర్సింలు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునిత, విద్యుత్ లైన్ ఇన్‌స్పెక్టర్ నర్సింలు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అఖిల్ పాల్గొన్నారు.



ప్రజావాణిలో అధికారులకు అర్జీలు ఇస్తున్న లబ్ధిదారులు

కార్గో సేవలతో ప్రయోజనం

కాంగ్రెస్ నాయకుడు ఆంజనేయులు



కార్గో సేవలను ప్రారంభిస్తున్న ఆంజనేయులు

కుల్కచర్ల : పట్టణ, పరిసర ప్రాంతాల ప్రయాణికులకు ఆర్టీసీ ద్వారా పార్శల్, కొరియర్ సర్వీసు(కార్గో) సేవలు అందుబాటులో ఉన్నాయని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఆర్టీసీ గ్రామ బస్సు ఆఫీసర్ చంద్రయ్యతో కలసి కార్గో సేవలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వం, ఆర్టీసీ శాఖ ఏర్పాటు చేసిన కార్గో సేవలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. దూర ప్రయాణికులకు కార్గో సేవల ద్వారా సామగ్రిని తరలించడానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో స్థానికులు అనంతయ్య, కృష్ణయ్య, బాలకృష్ణయ్య, సోమలింగం, షరీఫోద్దీన్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సముచిత స్థానం



మర్పల్లి: ఉపాధ్యాయులతో ఎంపీడీఓ, ఎంఈఓ

ఎంపీడీఓ రాజ్‌మల్లయ్య

మర్పల్లి: సమాజంలో ఉపాధ్యాయులకు సముచిత స్థానం ఉందని ఎంపీడీఓ రాజ్‌మల్లయ్య అన్నారు. విద్యార్థులలో దాగిన నైపుణ్యాలను వెలికితీసి భావి భారత పౌరులుగా తీర్చిదిద్దాలని బాధ్యత గురువులపై ఉందన్నారు. సోమవారం మండల స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారికి సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలో తల్లిదండ్రుల తరువాత స్థానం గురువులకే దక్కుతుందన్నారు. అలాగే. ఎంఈఓ విద్యాసాగర్ మాట్లాడుతూ.. ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు 51 ఉండగా అందులో 18 మందిని మండలస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేశామన్నారు. అనంతరం వారిని సన్మానించి ప్రశంసా పత్రం, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణకుమార్, కస్తూర్బా బాలికల గురుకుల పాఠశాల ఎస్ఓ సునిత, హెచ్‌ఎం నర్సింగ్‌రావు, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, ఉన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

ధారూరు: మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేసి సన్మానించారు. ఎంపికై న వారిలో బిందుసిల్పకుమారి, అపర్ణా, శర్వాణి, నషీరొద్దీన్, సువర్ణరేఖ, గౌరీనాయుడు, సౌజన్య, గీత, శిరీషా, శాంతమ్మ, అరుణ, నిజామోద్దీన్, రాజేందర్‌లను సన్మానించి, మెమొంటోలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి మల్లేశం, తహసీల్దార్ సాజిదాబేగం, ఎంపీడీఓ నర్సింహులు, ఎంఈఓ బాబుసింగ్, అధికారులు, ఉపాధ్యాయ సంఘాలు నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.



ధారూరు: ఉపాధ్యాయులను సన్మానించిన అధికారులు

నేడు ఉపాధ్యాయులకు సన్మానం

బంట్వారం: కోట్‌పల్లి మండలస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులకు మంగళవారం మానవవనరుల కేంద్రంలో సన్మానం నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ చంద్రప్ప సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించే సన్మాన కార్యక్రమానికి అధికారులు, ఉపాధ్యాయులు సకాలంలో హాజరు కావాల్సిందిగా కోరారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం

కుల్కచర్ల : పేద కుటుంబాలకు అండగా ఉంటామని చాపలగూడెం మాజీ సర్పంచ్ లక్ష్మ ణ్ అన్నారు. సోమవారం మండలంలోని చాపలగూడెం గ్రామానికి చెందిన సాయమ్మ అనే మహిళా అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఆయన మృత దేహానికి నివాళులర్పించి, బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నేతలు మొగులయ్య, వెంకటయ్య, భీమయ్య, బాలయ్య, యాదయ్య, నర్సింహులు, లక్ష్మయ్య పాల్గొన్నారు.

నాణ్యమైన బియ్యం పంపిణీ చేస్తాం

- జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ విజయలక్ష్మి

సాక్షి ఎఫెక్ట్..

తాండూరు రూరల్: నాణ్యమైన రేషన్ బియ్యం పంపిణీ చేస్తామని జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ విజయలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సోమవారం సాక్షి దినపత్రికలో 'రేషన్ బియ్యం ఇలా..తినేదెలా'! అనే వార్త ప్రచురితమైంది. ఈ వార్తకు సంబంధించి జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ స్పందించారు. రేషన్ బియ్యం పంపిణీలో వ్యర్థాలు రావడంపై జిల్లా పౌరసరఫరాల శాఖ మేనేజర్ విజయలక్ష్మిని వివరణ కోరారు. ఇందుకు ఆమె స్పందిస్తూ తాండూరులోని బియ్యం సరఫరా చేసే ఎంఐఎస్ స్టాక్ పాయింట్ వద్దకు తమ సిబ్బందిని పంపించారు. వారు బియ్యంలో ఎలుక గోళికలు ఉన్నయని చెప్పారు. దీంతో జగిత్యాల జిల్లా నుంచి తాండూరు స్టాక్ పాయింట్‌కు వస్తున్న రేషన్ బియ్యం సరఫరాను వెంటనే నిలిపివేస్తామని స్పష్టం చేశారు. నాణ్యమైన రేషన్ బియ్యం పంపిణీకి చర్యలు తీసుకుంటామన్నారు. అంతేకాకుండా స్టాక్ పాయింట్ వద్దకు డీలర్లు వచ్చి సరుకులు చూసిన తర్వాత తీసుకెళ్లాలని చెప్పారు.

ఘనంగా కాళోజీ జయంతి



పెద్దేముల్: నివాళులర్పిస్తున్న నాయకులు

పెద్దేముల్: మండల కేంద్రంలోని కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో శాఖ గ్రంథపాల కుడు కృష్ణ, పీసీసీ మైనార్టీ రాష్ట కన్వీనర్ యండి. రియాజ్, మాజీ ఎంపీటీసీ విద్యాసాగర్, మాజీ మార్కెట్ కమిటీడైరక్టర్ శిబ్లి, మండల యూత్ కాంగ్రెస్ నాయకుడు బోయిని మహేశ్ పాల్గొన్నారు.

దుద్యాల్‌లో..

దుద్యాల్ : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం కాళోజీ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర విద్యావంతుల వేదిక రాష్ట్ర కార్యదర్శి రవీందర్‌గౌడ్ మాట్లాడుతూ.. స్వాతంత్రోద్యమం, తెలంగాణ తొలిదశ, మలిదశ ఉద్యమంలో అన్యాయాన్ని వ్యతిరేకించిన వ్యక్తి కాళోజీ అని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు మల్లప్ప, రాములు, సుధాకర్‌రావు, సిబ్బంది రాహుల్, పాఠశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

కొడంగల్ రూరల్ : ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమ వారం తెలుగు భాషా దినోత్సవం, ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కాళోజీ చిత్రపటానికి పూలమాలలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా కళాశాల ఇన్ చార్జి ప్రిన్సిపాల్ రాంబాబు, తెలుగు అధ్యాపకులు బి.మోహన్, బి.నర్సింలు మాట్లాడుతూ.. ప్రత్యేక రాష్ట్రం కోసం ఆయన జీవితాన్ని అంకితం చేసిన ప్రజల మనిషిగా, స్వరాష్ట్ర ఆకాంక్షను రగిలించిన మహనీయుడని కొనియాడారు. నిర్మోహమాటంగా నిక్కచ్చిగా వ్యవహరిస్తూ స్పందించే వ్యక్తిత్వం కాళోజీదని అన్నారు. కార్యక్రమంలో జువాలజీ అధ్యాపకులు రమేశ్, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

మున్సిపల్ చైర్మన్ ముకుందఅశోక్‌కుమార్

పరిగి: ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్ కుమార్ అన్నారు. సోమవారం పట్టణ కేంద్రంలో 11వ వార్డు మార్కెట్ రోడ్డులో సీసీ అండర్ డ్రైనేజీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎలాంటి అవకతవకలు జరగకుండా నాణ్యత ప్రమాణాలతో పనులను నిర్వహించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. గంజ్‌రోడ్డులో దుకాణసముదాయాలు ఎక్కువగా ఉండటం, అండర్ డ్రైనేజీ లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, తమ దృష్టికి వచ్చిందన్నారు. త్వరలో సమస్య పరిష్కారమవుతుందన్నారు. పట్టణాన్ని జిల్లాలోనే ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దేందుకు పనిచేస్తూనే ఉంటానని అన్నారు. అభివృద్ధికి పార్టీలకు అతీతంగా ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు నాగేశ్వర్, మునీర్, కృష్ణ, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కృష్ణ పాల్గొన్నారు.



అండర్ డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న అశోక్

ప్రజావాణికి దరఖాస్తులు నిల్

బంట్వారం: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఒక్క దరఖాస్తు కూడా రాలేదు. ఎంపీడీఓ రాములు ఆయా శాఖల అధికారులు మీటింగ్‌హాల్‌లో వేచి చూసినప్పటికీ ప్రజల నుంచి స్పందన కనిపించ లేదు. దీంతో అధికారులు తమ విధులకు వెళ్లిపోయారు. ప్రజలు ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ రాములు తెలిపారు. ఏమైనా సమస్యలుంటే అర్జీలు అందజేయాలని కోరారు.

మోమిన్‌పేటలో..

మోమిన్‌పేట: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి దరఖాస్తులు కరువయ్యాయి. అధికారులు సకాలంలో వచ్చినా ఒక్క దరఖాస్తు కూడా రాలేదు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయలక్ష్మి, తహసీల్దార్ మనోహర్ చక్రవర్తి, ఏఈపీఆర్ ప్రణీత్‌కుమార్, ఏపీఓ శంకర్, ఏపీఎం రాజు ఉన్నారు.



మోమిన్‌పేట: ప్రజావాణిలో అధికారులు

పారిశుద్ధ్యంపై నిర్లక్ష్యం తగదు

ఎంపీడీఓ విశ్వప్రసాద్



కార్యదర్శులతో మాట్లాడుతున్న విశ్వప్రసాద్

తాండూరు రూరల్: గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణపై నిర్లక్ష్యం చేయొద్దని ఎంపీడీఓ విశ్వప్రసాద్ హెచ్చరించారు. సోమవారం మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. గ్రామాల్లో అన్ని వార్డుల్లో నెల రోజుల పాటు పారిశుద్ధ్య స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని సూచించారు. ఎక్కడ కూడా అపరిశుభ్రంగా ఉండొద్దని చెప్పారు. వీధిలైట్లు వెలిగేలా చూడాలని.. అవి పని చేయకపోతే కొత్తవి ఏర్పాటు చేయాలన్నారు. నాటిన మొక్కలు చనిపోతే వాటి స్థానంలో వేరే మొక్కలు నాటాలని పేర్కొన్నారు. ఓటరు లిస్టు వార్డు వారీగా సరి చూసుకొని.. తప్పులు ఉంటే సరి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీఓ ఆనంద్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వరద బాధితులను ఆదుకుందాం

సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ

పరిగి: వరదల కారణంగా ఎంతో మంది నిరాశ్రయులైయ్యారని, వారిని మానవత్వంతో ఆదుకుందామని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ పిలుపునిచ్చారు. సోమవారం పట్టణ కేంద్రంలో పలు దుకాణాల్లో వరద బాధ్యతుల కోసం విరాళాలు సేకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వర్షాల కారణంగా ఎంతో మంది రోడ్డున పడ్డారన్నారు. తిండికి లేక ఆకలితో అల్లాడుతున్న కుటుంబాలు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఉద్యోగి, వ్యాపారస్తులు, ప్రజలు ముందుకు వచ్చి తోచిన విరాళం అందించాలని కోరారు. ఒక్క రోజు సీఐటీయూ ఆధ్వర్యంలో విరాళాల సేకరణ చేసి వరద బాధితులకు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు తిరుమలయ్య, మంగమ్మ, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.



వరద బాధితులకు విరాళం సేకరిస్తున్న సీఐటీయూ నాయకులు



బషీరాబాద్‌లో కొలువుదీరిని మట్టివినాయకుడు



తాండూరు టౌన్: శాంతినగర్‌లో వినాయకుడికి పూజలు చేస్తున్న మహిళలు

లంబోదరుడికి పూజలు

జిల్లా వ్యాప్తంగా కొలువుదీరిన గణనాథులు మూడో రోజూ సోమవారం ప్రత్యేక పూజలు అందుకున్నారు. భక్తులు వివిధ రకాల ప్రసాదాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పలు మండపాల వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు, భజనలు, అన్నదానం నిర్వహించారు. పలుచోట్ల ఉట్టి కొట్టే కార్యక్రమాలతో యువత సందడి చేశారు.



మోమిన్‌పేటలోని ఎన్కేపల్లిలో పూజలు నిర్వహిస్తున్న ఎస్ఐ



ధారూరు: పూజలందుకుంటున్న గణనాథుడు



కొడంగల్ రూరల్ : నాణనాథుడిని దర్శించుకుంటున్న చిన్నారులు



దుద్యాల్: పూజలు చేస్తున్న యువకులు

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
వెంకటరమణ-9912220528
Md. జకీర్-9573005622